తల్లికి వందనం ఒక్కరికేనా?

పామర్రు: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రారంభించి నెలరోజులు పూర్తి కావస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం అందిస్తానన్న తల్లికి వందనం పథకం అందజేయకపోవడంతో ఎంతోమంది లబ్ధిదారులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకాన్ని పేరు మార్చి తల్లికి వందనం పేరుతో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇంట్లో చదువుకునే చిన్నారులు ఎంత మంది ఉంటే అంతమందికీ ఏడాదికి ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున వారి తల్లులకు అందజేస్తామని ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు విద్యార్థుల తల్లులు అందరూ నమ్మి ఓట్లు వేసి గెలిపించారు.

పాఠశాలలు ప్రారంభించి నెల గడుస్తున్నా...

పాఠశాలలు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ఇంతవరకు తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధి చేకూరలేదు. దీంతో పాఠశాలల ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు కట్టకపోతే చిన్నారులకు పుస్తకాలు ఇవ్వని పరిస్థితి. తల్లికి వందనం పథకం డబ్బులు వస్తాయని, పిల్లలను సంతోషంగా బడికి పంపించవచ్చని అనుకున్న తల్లుల ఆశలు నిరాశేనా అని మథనపడుతున్నారు.

ప్రభుత్వ జీవోతో గుండెలు గుబేలు

ప్రస్తుతం తల్లికి వందనం పథకానికి సంబంధించి ప్రభుత్వ ఇచ్చిన జీవోలో ఇంట్లో తల్లికి ఒక్కరికి మాత్రమే రూ.15వేలు ఇస్తామని తెలుపడంతో లబ్ధిదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎంతో ఆశగా ఇంట్లో చదువుకునే పిల్లలు అందరికీ అందజేస్తానన్న పథకం ఒక్కరికి మాత్రమే అని తెలియడంతో తల్లులు ఆవేదన చెందుతున్నారు. అమలు చేయలేని వాగ్దానాలు ఇచ్చి ప్రజల్ని మోసం చేయటం కాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచించి ఒక కుటుంబంలో ఉన్న అందరు పిల్లలకు అమ్మకు వందనం పథకం వర్తింప చేయాలని కోరుకుంటున్నారు.



కూటమి మేనిఫెస్టోలో ఒక్కొక్క విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని పేర్కొన్న హామీ

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నా..



నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాల స్థాయి నుంచి విద్యనభ్యసించే ప్రతి పిల్లవాడికీ రూ.15వేలు వంతున ఆర్థిక సాయం అందిస్తానని చంద్రబాబునాయుడు చేసిన ప్రకటనతో సాయం ఎప్పుడు అందుతుందోనని ఎదురుచూస్తున్నా. నా కుమారుడు, కుమార్తె స్థానిక జెడ్పీ హైస్కూల్లో 9, 6 తరగతులు చదువుతున్నారు. వీరిద్దరికీ కలిపి రూ.30వేలు సాయం అందించాలి.

– కొక్కు శ్రావణి, లింగాల, మండవల్లి

ఆర్థికభారం వెంటాడుతోంది



నా ఇద్దరు కుమారులు కైకలూరు నేషనల్ స్కూల్‌లో చదువుతున్నారు. కాన్వెంట్‌లో ఫీజులు చెల్లించమని యాజమాన్యం పదేపదే కోరుతున్నా ఆర్థిక ఇబ్బందులతో కట్టలేకపోతునాం. సీఎం చంద్రబాబు తల్లికి వందనం పథకం ద్వారా ఒక్కొక్కరికీ రూ.15 వేలు ఇస్తానన్నారు. అవి వెంటనే వేస్తే పిల్లల ఫీజుకు పనికొస్తాయి.

– మెహరున్నీసా, మండవల్లి

అందరికీ పథకం వస్తుందని ఆశిస్తున్నా



కుటుంబంలో ఉన్న ప్రతి చిన్నారికి తల్లికి వందనం వస్తుందని ఆశిస్తున్నా. పాఠశాలలు ప్రారంభించి నెల రోజులు పూర్తి కావస్తున్నా ఇంతవరకు పథకం డబ్బులు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం ఇంటికి ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని అంటున్నారు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచన చేసి ఇంట్లో ఉన్న ప్రతి చిన్నారికి పథకం వర్తింపచేయాలి.

–పి.త్రినేత్రి, పామర్రు

మేనిఫెస్టోలో చెప్పినట్టుగా ఇస్తారని ఆశిస్తున్నా



ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం ఇస్తారని ఎదురుచూస్తున్నాం. ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకొంటారనే అనుకుంటున్నా. త్వరగా ఆ పథకం డబ్బులు పడితే బాగుండు.

–శ్రీలక్ష్మి, పామర్రు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రులో నిర్వహిస్తున్న జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పేర్ని రవికుమార్ తెలిపారు. మరమ్మతుల కారణంగా కోడూరు, పేరూరు, 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీనిని గుర్తించి ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

సరసమైన ధరలతో నాణ్యమైన సరుకులు

పామర్రు: రైతుబజారులో సరసమైన ధరలలో నాణ్యమైన సరుకులు అమ్మకం చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక రైతు బజారులో నిత్యావసర సరుకుల విక్రయ దుకాణాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ దుకాణంలో బియ్యం కేజీ రూ.49, కందిపప్పు కేజీ రూ.160కే విక్రయిస్తారన్నారు.అనంతరం రైతు బజారు సిబ్బంది ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీ పల్లవి, పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు, రైతు బజారు ఎస్టేట్ ఆఫీసర్ బలిజేపల్లి శ్రీనివాస్, ప్రముఖ వ్యాపార వేత్త బొగ్గరపు శ్రీనివాస్, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

పుల్లేరు కాలువకు ప్రత్యేక పూజలు

ప్రతి బొట్టును సద్వినియోగం చేసే దిశగా ప్రభుత్వ పటిష్ట చర్యలు చేపడుతోందని పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజా అన్నారు. కృష్ణాతూర్పు డెల్టాకు నీటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన నీటికి ఎమ్మెల్యే ప్రత్యేకంగా పూజలు చేశారు. దీని ద్వారా నియోజకవర్గంలో తాగునీరు, సాగునీరు పుష్కలంగా లభిస్తుందని అన్నారు.

క్లుప్తంగా

జనాభా నియంత్రణపై అవగాహన

తోట్లవల్లూరు: ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రమైన తోట్లవల్లూరులో ఆరోగ్య సిబ్బంది గురువారం ర్యాలీ జరిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఎస్సీ వాడ వరకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న పర్యవేక్షణలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణకు పాటించాల్సిన పలు పద్ధతులపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, హెల్త్ సూపర్‌వైజర్లు అనిల్‌కుమార్, రోహిణి, సీహెచ్‌ఓ దివ్యలత, ఆరోగ్య సిబ్బంది శివరామకృష్ణ, కమలాక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు నోట్ పుస్తకాలు పంపిణీ

గుడివాడటౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం కార్యక్రమాలలో భాగంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు యాదవ సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఓల్డ్ టౌన్ - 2 మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. శివ ఇంటీరియర్స్ అధినేత ఎం.శివ వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.నాగమణి, ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, కంతేటి హరిబాబు పాల్గొన్నారు.

చౌక ధరల దుకాణం ప్రారంభం

గుడివాడటౌన్: ప్రజలకు నిత్యావసర సరుకులు తక్కువ ధరకు అందించే లక్ష్యంతో రైతు బజారులో చౌక ధరల దుకాణం ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ పి.పద్మావతి తెలిపారు. రైతు బజారులో ఏర్పాటు చేసిన చౌక ధరల దుకాణాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కందిపప్పు కిలో రూ.160, స్టీమ్డ్ బియ్యం కిలో రూ.49, సోనామసూరి కిలో రూ.48కి అమ్మాలని తెలిపారు. పౌర సరఫరాల శాఖ ద్వారా ఈ దుకాణం ఏర్పాటుచేశామన్నారు. కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జి), తహసీల్దార్ రామాంజనేయులు, డీటీలు రంగారావు, లోకరాజు, రైతుబజారు ఈఓ శ్రీకాంత్, ఆర్ఐ నాగబాబు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గుడివాడటౌన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ 49వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. నూతన అధ్యక్షునిగా ఉప్పలపాటి సతీష్, కార్యదర్శిగా గుడివాడ వేణుగోపాల స్వామి, కోశాధికారిగా పోలుకొండ సుబ్రహ్మణ్యం, లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ సంఘమిత్ర అధ్యక్షురాలిగా ఉప్పలపాటి ఝాన్సీలక్ష్మి, కార్యదర్శిగా గుడివాడ ధనలక్ష్మి, కోశాధికారిగా కాట్రగడ్డ రజిని ప్రమాణ స్వీకారం చేశారు. సేవా కార్యక్రమాలలో భాగంగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరిరావు, క్లబ్ పూర్వ అధ్యక్షులు, కార్యదర్శులు, లయన్స్‌క్లబ్ ప్రగతి, గుడివాడ, గుడ్లవల్లేరు లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కౌతవరం హైస్కూల్ విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు

గుడ్లవల్లేరు: నూజివీడు, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు కౌతవరం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం బి.వి.ఎస్.ఎల్.పద్మావతి గురువారం విలేకరులకు తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీకి పి.మను బాలాజి, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి జె.సాత్విక్ సీట్లు పొందినట్లు ఆమె పేర్కొన్నారు. బాలాజి, సాత్విక్‌లను ఎంఈఓలు జె.జగన్మోహనరావు, జి.గోపాలరావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక

మండవల్లి: మండవల్లికి చెందిన సాయిశ్రీకి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు వచ్చినట్లు స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్ గురువారం తెలిపారు.మండవల్లి జెడ్పీ హైస్కూల్‌లో సాయిశ్రీ పదో తరగతిలో 600కు 578 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



తోట్లవల్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ రెవెన్యూ సిబ్బందికి పట్టుబడిన ఘటన మండలంలోని బొడ్డపాడులో జరిగింది. వల్లూరుపాలెం వైపు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకలోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను బుధవారం అర్ధరాత్రి రెవెన్యూ సిబ్బంది పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన ట్రాక్టర్‌కు జరిమానా విధిస్తామని తహసీల్దార్ కుసుమకుమారి తెలిపారు.

రైతుకు రోటరీ క్లబ్ సాయం

తోట్లవల్లూరు: రైతులకు ఉయ్యూరు రోటరీక్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం తెలియజేశారు. మండలంలోని రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంకలో కస్తూరి రమేష్‌కు చెందిన ఎద్దు ఇటీవల ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. రైతు రమేష్‌ను గురువారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం, కేసీపీ ప్రతినిధులు పరామర్శించి క్లబ్ తరపున రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కేసీపీ జనరల్ మేనేజర్ వీవీ పున్నారావు, డీజీఎం వెంకటేశ్వర్లు, రోటరీ కార్యదర్శి అమీర్ మీర్జా పాల్గొన్నారు.

పోర్టు నిర్మాణంతో వేలాదిమందికి ఉపాధి

ఎంపీ వల్లభనేని బాలశౌరి


మాట్లాడుతున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి, పక్కన పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజా

పామర్రు: ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మచిలీపట్నంలో పోర్టు నిర్మాణంతో వేలాదిమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కలుగుతాయని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద ప్రగతి పథం ప్రజా సమస్యల పరిష్కార వేదికను గురువారం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ పాల్గొని మాట్లాడుతూ త్వరలో కేంద్రంతో మాట్లాడి మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో మరిన్ని పరిశ్రమలను తీసుకువస్తామని, దీనితో నిరుద్యోగులకు అవకాశాలు ఎక్కువగా కలుగుతాయని అన్నారు. పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజాకు ఎప్పుడు ఏ అవసరమున్నా అన్నివిధాలా సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. బందరు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ ప్రగతిపథం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రతి గురువారం నిర్వహిస్తామని, ప్రజలు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని సత్వరమే పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎంపీని ఎమ్మెల్యే తదితరులు కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వల్లూరిపల్లి గణేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, నాయకులు గొట్టిపాటి లక్ష్మీదాసు, మండపాక శంకరబాబు, వీరంకి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, నేతలు అల్లంశెట్టి నరేష్, టి.సాంబశివరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో ఆక్రమణల తొలగింపు



ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి పంచాయతీ పరిధిలో డ్రెయిన్లను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించే పనులు చేపట్టారు. స్థానిక గురజ రోడ్డులో కొంత మంది తాము ఆక్రమించిన స్థలాలను అనధికారికంగా చిరువ్యాపారులకు విక్రయించడం, దీంతో డ్రెయిన్లలో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి ప్రజలు తరచూ అవస్థలు పడుతున్నారు. దీనిని గుర్తించిన సర్పంచ్ నిమ్మగడ్డ కై కమ్మ, కార్యదర్శి రమేష్, పాలకవర్గ సభ్యులు ఆక్రమణలను తొలగించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆక్రమణలు తొలగించిన వెంటనే సీసీ డ్రెయిన్లు నిర్మిస్తామని వివరించారు.

ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


నగదు ప్రోత్సాహకాలు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఉపాధ్యాయులు

పామర్రు: విద్యార్థులు క్రమశిక్షణతో పాటు చదువులో కూడా ముందంజలో ఉండాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్‌లో 2023–24 ఏడాదిలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దాతల సహకారంతో నగదు ప్రోత్సాహకాలను గురువారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులను దాతలు ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. ఇంగ్లిషు మీడియంలో ప్రథమ బహుమతి సాధించిన పెనుమూడి స్నేహితకు రూ.22,500, ద్వితీయ స్థానం సాధించిన జీవీఎస్ అంజలికి రూ.15 వేలు, తృతీయ స్థానం సాధించిన ఆర్.హేమశ్రీకి రూ.7,500 అందజేశారు. తెలుగు మీడియంలో ప్రథమ స్థానం పొందిన చింతా సుజికి రూ.22,500, ద్వితీయ స్థానం సాధించిన షేక్ షరీఫ్‌కు రూ.15వేలు, తృతీయ స్థానం సాధించిన డి.ఐశ్వర్యకు రూ.7.500 అందజేశారు. దాత కంచర్ల రామారావు కుమారులు కేశవ్, చక్రవర్తి వీటిని అందించారు. ఎన్ఆర్ఐ గుజవర్తి రామకృష్ణారెడ్డి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంగా రూ.30వేలను అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పామర్రు ఎంఈవో–2 జి.పద్మవాణి, హైస్కూల్ హెచ్‌ఎం ఎ.ఇందిరా రాణి, టీడీపీ నాయకులు వల్లూరిపల్లి గణేష్, బొమ్మారెడ్డి కోటిరెడ్డి, వి.చక్రవర్తి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

కైకలూరు: బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం పాటించడం తల్లీబిడ్డకు శ్రేయస్కరమని కలిదిండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ ఎస్.జాహ్నవి చెప్పారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం సీహెచ్‌సీలో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కృష్ణకిషోర్, పీహెచ్‌ఎన్ నాగమణి, ఎంపీహెచ్‌ఎస్‌లు హిమనాగమణి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై బియ్యం, కందిపప్పు


కైకలూరు రైతుబజారులో తక్కువ ధరకు కందిపప్పు అందిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: పెరిగిన ధరల నేపథ్యంలో నిత్యావసర సరుకులైన బియ్యం, కందిపప్పును సబ్సిడీపై ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు సరఫరా చేస్తోందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. కైకలూరు రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ఈ స్టాల్‌లో కిలో కందిపప్పు రూ.160కి, స్టీమ్డ్ బియ్యం బీపీటీ/సోనామసూరి రూ.49కి, పచ్చి బియ్యం బీపీటీ/సోనామసూరి రూ.48కి అమ్మకాలు చేస్తారన్నారు. అనంతరం రైతుబజారు బయట తోపుడు బండ్లు పెట్టకుండా, కేవలం కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్‌కు వినియోగించాలని పోలీసు సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో రైతు బజారు ఎస్టేట్ ఆఫీసర్ నందినీదేవి, మార్కెట్ యార్డు సెక్రటరీ సౌజన్య, రైస్ మర్చంట్స్ అసోషియేషన్ సభ్యులు మువ్వల నాగేశ్వరరావు, దాసరి నాని రామకృష్ణ, వరద సురేష్ పాల్గొన్నారు.

పోల్‌రాజ్ పంట కాల్వకు మోక్షం

కైకలూరు: వ్యర్థాలు, చెత్తతో పూడుకుపోయిన కైకలూరు పోల్‌రాజ్ పంట కాల్వకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇటీవల పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ త్వరలో కాల్వకు నీరు విడుదల చేసే అవకాశం ఉండడంతో కైకలూరుకు చెందిన నర్సిపల్లి అప్పారావు, కొండ్రెడ్డి సత్యనారాయణ, గుర్రం శ్యామ్, కేవీఎస్ఎం నాయుడుతో కలిపి కమిటీ వేశారు. దీంతో గురువారం నుంచి మనుషులతో చెత్త తొలగింపు పనులు చేపట్టారు. శుక్రవారం నుంచి పొక్లెయిన్‌లతో చెత్తను తొలగిస్తామని కమిటీ సభ్యులు చెప్పారు.

రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలి

గుడివాడరూరల్: రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని గుడివాడ పట్టణ టూటౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు సూచించారు. స్థానిక ప్రభుత్వ కేబీఆర్ ఐటీఐ కళాశాలలో టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసువారి సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనం నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ మోటారు వాహనాల చట్టాలను గౌరవించి, ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. ఎంవీఐ స్వామి, ప్రిన్సిపాల్ గౌరీమణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మన శరీరమే మన మొదటి గురువు

కైకలూరు: మన శరీరమే మన మొదటి గురువుగా అన్ని మార్పులను తెలియజేస్తోందని మైసూరు దత్త క్రియా యోగ అంతర్జాతీయ కేంద్ర యోగా గురువులు కామేశ్వర శర్మ, చక్రధారి చెప్పారు. లోకుమూడిగురువు దత్తాశ్రమంలో దత్త క్రియా యోగా మూడు రోజుల శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. దత్తాశ్రమ నిర్వాహకులు గురజాడ ఉదయశంకర్ మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు యోగా తరగతులు జరుగుతాయన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన

మండవల్లి: కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లలకు సంబంధించిన రక్షణ, సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ కేస్ స్టడీస్ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.దీప్తి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల సూపర్‌వైజర్లు ఎం.లావణ్య, వి.కృష్ణకుమారి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం- చేవూరుపాలెం సెంటర్లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన మునుకుట్ల సూర్యనారాయణ జ్ఞాపకార్థం కుమారుడు కృష్ణమూర్తి, రామలక్ష్మి దంపతులు గురువారం రూ.52,116 విరాళంగా అందజేశారు. ఈమేరకు చెక్కును ఆలయ అర్చకుడు తోలేటి వీరభద్రశర్మకు అందజేసినట్లు సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె

కైకలూరు: స్థానిక శ్యామలాంబతల్లి ఆలయ ప్రాంగణంలో కొలువైన పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీమాతకు ఆషాఢ సారెను మహిళలు గురువారం సమర్పించారు. వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ వీధిలో మహిళలు ఆషాఢ సారెతో పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి దేవాలయం చుట్టూ సారెతో ప్రదక్షిణలు చేసి అర్చకులకు సారెను అందించారు. ఈఓ వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జెడ్పీ పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు అందజేత


విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, సర్పంచ్ రాజేష్

గుడివాడరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు దాతలు అందించే సహాయాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని పర్నాస గ్రామంలో జెడ్పీ పాఠశాల విద్యార్థినులు 15మందికి దాత గోళ్ల వీర్రాజు అందజేసిన రూ.1లక్ష విలువైన 15 సైకిళ్లను జెడ్పీటీసీ రామకృష్ణ సర్పంచ్ గొర్ల రాజేష్‌తో కలసి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, దీంతో పాటు దాతలు అందచేస్తున్న సహాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ చైర్మన్ జి.సురేష్, హెచ్‌ఎం ఎస్.నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరంలో పాల్గొన్న వైద్యులు, క్లబ్ సభ్యులు

పామర్రు: వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శృతి హాస్పిటల్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం మాట్లాడుతూ ఈ శిబిరంలో పామర్రు పరిసర ప్రాంతాల నుంచి 100 మందికి పైగా రోగులు పాల్గొని ఉచిత వైద్య సేవలను పొందారని అన్నారు. బీపీ, సుగర్, ఈసీజీ, ఎముకల సాంద్రత పరీక్షలు, గుండె పరీక్షలను ఉచితంగా నిర్వహించామని చెప్పారు. శిబిరంలో కార్డియాలజిస్టు డాక్టర్ అఖీఫ్ మహమ్మద్ ఉచితంగా ఈసీజీలను, అవసరమైన వారికి 2-డి స్కానింగ్ చేశారన్నారు. వైద్యులు శృతి, అనిత, రమ్య, సంతోషి, గోపాలం, బిందు మహిళలకు అవసరమైన వైద్య పరీక్షలను చేసి మందులను ఉచితంగా అందజేశారని అన్నారు. ప్రముఖ కంటి వైద్యుడు డాక్టర్ పొట్లూరి వినోద్ కంటి పరీక్షలను చేసి అవసరమైన వారికి తక్కువ ధరలకు కళ్ల జోళ్లు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు కేవీ జనార్దనరావు, చిన్నం ఆదినారాయణ, పరిశ వెంకట నాంచారయ్య, తాళ్లూరి నరేష్, హనుమ పిచ్చేశ్వర రావుపాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

పామర్రు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, 1214 మెమో రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు సంక్షేమ బోర్డు నుంచి అమలుచేయాలని, పెండింగ్ క్లయిములు ఇవ్వాలని, పెండింగ్ కార్డులు అందజేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు గురువారం తమ సమస్యల అర్జీని పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజాకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఒ.గంగాధర ప్రసాద్, నాయకులు పెదబాబు, రమేష్, రఘు, ఖాన్, భిక్షు ఉన్నారు.